క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కోవూరు : కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా కొడవలూరు మండలంలో రైతులకు అవసరమైన పలు కల్వర్టుల గురించి వివరించారు. ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, డీఏబీ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ఉన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీతారాములకు కల్యాణం

కోవూరు : మండలంలోని గంగవరం గ్రామంలో మంగళవారం సీతారాముల కల్యాణం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా కోలాట నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కొనక ప్రశాంత్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు.

శ్రీరామానుజులు స్వామికి పంచామృతాభిషేకం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న లక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 8 గంటలకు శ్రీరామానుజులు స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పూజలు, దేవస్థానం చుట్టూ ప్రదక్షిణోత్సం జరిగింది. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సామూహిక ఉపనయనాలు



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరులో ఉన్న ఆదిశంకరాచార్యుల మఠంలో మంగళవారం 45వ బ్రాహ్మణ సామూహిక ఉపనయనాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘ నేత మాలేపాటి రత్నప్రసాద్ మాట్లాడుతూ ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉపనయనాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, ఫణి, సురేష్, పరమేశ్వరరావు, రఘునాథయ్య, బాలు, గోపాల్ పాల్గొన్నారు.

దినేష్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి




ఎస్సై రాజేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ఇందుకూరుపేట : దళిత నేతలను కించపరిచేలా మాట్లాడిన టీడీపీ నేత పోలంరెడ్డి దినేష్ రెడ్డి క్షమాపణ చెప్పాలని దళిత నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తూరులో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నుంచి కింద స్థాయి టీడీపీ నేతల వరకు ఇలా కించపరుస్తూ మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం స్థానిక ఎస్సై వెంకటరాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈదూరు మధు, మోచర్ల శ్యామ్, వంశీ, నవీన్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తగిన బుద్ధి చెబుతాం

బుచ్చిరెడ్డిపాళెం : దళితులను కించపరిచేలా మాట్లాడిన దినేష్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బట్టా పాల్‌విల్సన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దళితులను అసభ్య పదజాలంతో మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఇప్పటికైన దినేష్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు.

అవగాహన ర్యాలీ



పొదలకూరు : ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మంగళవారం వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గేటు సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ జరిపారు. మహ్మదాపురం పీహెచ్‌సీ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ సర్ రోనాల్డ్‌రాస్ జన్మదినం సందర్భంగా మలేరియా నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. మలేరియా అధికారి ఆంజనేయవర్మ, సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, విస్తరణాధికారి రవికుమార్, శ్రీనివాసులు, రమణమ్మ, రాధాకుమారి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పనినీ పూర్తి చేస్తాం

- శంకుస్థాపనతో నిలిపివేయడం గత ప్రభుత్వ విధానం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కొలిదిబ్బలో సీసీరోడ్లను ప్రారంభించిన మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : 'అభివృద్ధి పనులను శంకుస్థాపనతో నిలిపివేయడం గత ప్రభుత్వ విధానం, శంకుస్థాపన చేసిన ప్రతి పనికి నిధులు కేటాయించి పూర్తి చేసి ప్రారంభించడం ప్రస్తుత ప్రభుత్వ విధానం' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పేడూరు గ్రామ సచివాలయ పరిధిలోని కొలిదిబ్బ, కృష్ణారెడ్డిపాళెం గ్రామాల్లో మంత్రి కాకాణి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం చేపట్టారు. ముందుగా గ్రామస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో రూ.1.35 కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రామాల్లో పర్యటిస్తే అనేక సమస్యలు ఉండేవని, ప్రస్తుతం గ్రామాల్లో అన్నిరకాల మౌలిక వసతులు సమకూరి ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీకే ప్రజలు మరోసారి పట్టం కట్టాలన్నారు. అనంతరం పేడూరుతోపు సమీపంలోని దేవాలయ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఎన్నో ఏళ్లుగా పట్టాల కోసం ఎదురు చూస్తున్న 63 మంది లబ్ధిదారులకు మంత్రి కాకాణి ఇళ్ల పట్టాలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెం చిరంజీవుల గౌడ్, తలమంచి సురేంద్రబాబు, కోటా శేఖర్‌రెడ్డి, ఈదూరు రమేష్, ఎంపీటీసీ సభ్యులు బి.వసంతి, సర్పంచ్ డి.ఝాన్సీ, కె.సుజన, కె.పెంచలరెడ్డి, బి.భాస్కర్, ఎస్.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే ప్రసంగాలు మానుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- పెయిడ్ ఆర్టిస్టులతో టీడీపీ కార్యక్రమాలు
- పోలంరెడ్డి దినేష్‌రెడ్డిపై ఎమ్మెల్యే ప్రసన్న ధ్వజం

కొడవలూరు : వయస్సులో చిన్నవాడైన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం సబబు కాదని, ఇకనైనా మానుకోవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను కుక్కలతో పోల్చడాన్ని ఆయన తప్పుపట్టారు. కొడవలూరులో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎప్పుడూ లేని దుష్ట సంస్కృతికి దినేష్‌రెడ్డి బీజం వేస్తున్నారన్నారు. నా సోదరుల కంటే పార్టీ నేతలు, కార్యకర్తలంటే ఎంతో అభిమానమని, వారిని కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదన్నారు. నేను టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వస్తే 90 శాతం మంది నా వెంటే వచ్చారని తెలిపారు. ఇప్పుడు టీడీపీలో అసలైన నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు లేరన్నారు.

నీ తండ్రికి రూ.కోట్లు ఎలా వచ్చాయ్

నీ తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి రూ.కోట్లు ఎలా వచ్చాయో ముందు తెలుసుకుని, తర్వాత ఇతరులను విమర్శించాలని దినేష్‌రెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. వెల్డింగ్ షాపు పెట్టుకుని బతికే వ్యక్తి ఒక్కసారిగా రూ.కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలన్నారు. రాపూరులో శ్రీనివాసులురెడ్డిపై దాడి చేస్తుంటే తన కారులో ఎక్కించుకొని ప్రాణాలు కాపాడానని గుర్తుచేశారు. కేవలం 15 మంది పెయిడ్ ఆర్టిస్టులతో నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. దినేష్‌రెడ్డి విమర్శలకు తగ్గట్టుగానే చలపతిరావు చేసిన విమర్శలు సమర్థనీయమన్నారు. పోలంరెడ్డి స్వగ్రామమైన నార్తురాజుపాళెంలో ఒక వార్డు సభ్యుడిగానైనా తండ్రీ, కొడుకులు గెలిచి చూపించాలని సవాల్ విసిరారని, దానిని స్వీకరించలేక నోరు పారేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏబీ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నేతలు ఒట్టూరు సునీతమ్మ, నక్కా తిరుపతమ్మ, పి.రవి, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.చిన్నా, ఎస్కె.నబీబుల్లా, ఎంపీటీసీ ప్రతాప్, సర్పంచ్ కామాక్షి పాల్గొన్నారు.

ఎస్పీఎఫ్ సిబ్బందికి వైద్యపరీక్షలు



సిబ్బందికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నెల్లూరు(క్రైమ్) : నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో పనిచేస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బందికి మంగళవారం ప్రాజెక్టు హాస్పిటల్‌లో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎస్పీఎఫ్ డీఐజీ రామిరెడ్డి, కమాండెంట్ శంకరరావు ఆదేశాల మేరకు సిబ్బందికి వైద్యపరీక్షలు చేయించామని అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎస్‌రెడ్డి తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వహించడమే కాదని, ఆరోగ్యంపట్ల తగిన శ్రద్ధ తీసుకోవాలని ఈసందర్భంగా ఆయన సిబ్బందికి సూచించారు.

టీడీపీని ఎప్పుడో మర్చిపోయారు



మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు(దర్గామిట్ట) : సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీని ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీకి జనాలు కరువై.. కూలికి నెల్లూరు నుంచి పలువుర్ని తీసుకొచ్చి మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తిరిగితే పది మంది కూడా రావడంలేదని ఎద్దేవా చేశారు. వెంకటాచలం మండలం యర్రగుంటకు చెందిన ముగ్గురు వ్యక్తులు నెల్లూరులో ఉంటున్నారని, వీరికి ఇంటి స్థలాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేటాయించారని చెప్పారు. వీరితో పాటు అద్దెకు జనాలను తీసుకొచ్చి 135 మంది టీడీపీలో చేరారని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. వీరిలో ముగ్గురు మినహా మిగిలిన వారికి నియోజకవర్గంలో ఓటు హక్కు ఉందనే విషయాన్ని నిరూపిస్తారా అని పలుమార్లు సవాల్ విసిరినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. సర్వేపల్లిలో సోమిరెడ్డికి టికెట్ ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. మంత్రిగా బాధ్యతల్లో తలమునకలవుతూనే.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి కాకాణి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. పార్టీ నేతలు శివప్రసాద్, సురేష్‌రెడ్డి, మోహన్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, వెంకటాచలం జెడ్పీటీసీ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ చిన్నపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నేలటూరులో 'గడప గడపకు..'

ముత్తుకూరు : మండలంలోని నేలటూరు పంచాయతీలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరై పట్టపుపాళెం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు.

స్కూటీలో మంటలు

పొదలకూరు : పట్టణంలోని సంగం రోడ్డు సెంటర్ వద్ద హోండా యాక్టివా స్కూటీలో మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు చొరవ తీసుకుని మంటలను ఆర్పివేశారు. పట్టణానికి చెందిన సునీల్ స్కూటీపై సంగంరోడ్డు వైపు వెళ్తుండగా మంటలు చెలరేగడంతో బెంబేలెత్తిపోయాడు. స్కూటర్లో సాంకేతిక లోపంతో ఇలా జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

నేడు పడుగుపాడులో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

కోవూరు : మండలంలోని పడుగుపాడు గ్రామంలో బుధవారం ఉదయం 6.30 జరుగనున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి మంగళవారం తెలిపారు. నాయకులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థికి అభినందన



ఇందుకూరుపేట : జాతీయ స్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు మండలంలోని పాములవారిపాళెం విద్యార్థి వాకాటి కమలేష్ ఎంపికైనట్లు తండ్రి జయచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. నెల్లూరులోని రత్నం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కమలేష్ ఈనెల 21, 22వ తేదీల్లో అనంతపురంలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చూపి రాష్ట్ర జట్టులో స్థానం సాధించినట్లు తెలియజేశారు. కాగా ఎంపికైన విద్యార్థిని పీటీ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపల్ రజనీ అభినందించారు.

హుండీ కానుకల లెక్కింపు



ఇందుకూరుపేట : గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆయంలో హుండీ కానుకల లెక్కింపు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఈఓ శాంతయ్య మాట్లాడుతూ భక్తులు ఇచ్చిన కానుకల ద్వారా రూ.6,59,427లు రాబడి వచ్చినట్లు తెలిపారు. నాలుగున్నర నెలలకు సంబంధించి కానుకలను లెక్కించినట్లు వెల్లడించారు. అన్నప్రసాద వితరణకు అదనంగా రూ.20,341 వచ్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కొండూరు కృష్ణారెడ్డి, వేణంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం

బుచ్చిరెడ్డిపాళెం : ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని సాగనంపాలని సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో సీపీఎం ప్రచార బేరీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా ఈనెల 30 వరకు అన్ని మండలాల్లో ప్రచార బేరీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు జి.శ్రీనివాసులు, మల్లికార్జున, సురేష్, మునిస్వామి, శ్రీనివాసులు, అంకయ్య, ఖాదర్‌బాషా, జానకిరామయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, బుజ్జయ్య పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కోవూరు : తమ ఇల్లు ఖాళీ చేయాలని చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురైన ఇంటి యజమాని భార్య విషహత్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. వసీమ్ అక్రమ్ తన ఇంటిని డాక్టర్ శివకుమార్‌కు నాలుగేళ్ల క్రితం అద్దెకు ఇచ్చారు. ఇటీవల అద్దె చెల్లించకపోవడంతో యజమాని వసీమ్ ఇల్లు ఖాళీ చేయాలని కోరారు. అయితే శివకుమార్ ఇల్లు ఖాళీ చేయకుండా యజమానిపై పలు రకాల కేసులు పెట్టాడు. దీంతో వసీమ్ మంగళవారం నాలుగు అంతస్తుల మేడపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని హడావుడి చేశాడు. విషయం తెలుసుకున్న కోవూరు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని వసీమ్‌ను కిందకు తీసుకొచ్చారు. అయితే వసీమ్ భార్య విషహత్ బాత్‌రూం క్లీన్ చేసే మందును తాగింది. స్థానికులు ఆమెను కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎటువంటి ప్రమాదం లేదని డాక్టర్లు చెప్పారు. దీనిపై ఫిర్యాదు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుడితిపాళెంలో ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులకు సొసైటీ ఫార్మేషన్ సర్టిఫికెట్లు, క్యాష్‌బుక్, మినిట్స్‌బుక్, ఇతర రికార్డులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుడితిపాళెంలో 169 మంది మత్స్యకారులతో సొసైటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీనివల్ల సబ్సిడీపై బోట్లు, వలలు, టూ వీలర్స్, త్రీ వీలర్స్, డీజిల్ సబ్సిడీ, మత్స్యకార భరోసా లాంటి పథకాలకు ఇబ్బందులు ఉండవన్నారు. సొసైటీ ఏర్పాటులో మావులూరు శ్రీనివాసులురెడ్డి, టంగుటూరు ఉదయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ సురేష్, ఆప్కాఫ్ చైర్మన్ అనిల్ కృషి ఎనలేనిదన్నారు. స్థానిక నాయకులతో కలిసి జెడ్పీ చైర్మన్ ద్వారా రూ.50 లక్షలు తీసుకొచ్చి కుడితిపాళెం గ్రామంలో సిమెంటు రోడ్లు వేశామని, సైడ్ డ్రైయిన్స్ కోసం మరో రూ.50 లక్షల కావాలని కోరి ఉన్నామన్నారు.

వీఓఏలకు యూనిఫాం

వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న సీసీలు, వీఓఏలకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ద్వారా యూనిఫాంను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం రవిశంకర్‌రెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆప్కాఫ్ చైర్మన్ అనిల్, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, టంగుటూరు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ గండ్లశంకరయ్య, నేతలు కె.శ్రీనివాసులురెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డికి మంత్రి కాకాణి పరామర్శ



సుధీర్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయా డెయిరీ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. సుధీర్‌రెడ్డి తండ్రి, ప్రజా వైద్యుడు చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి(సీఆర్‌రెడ్డి) సోమవారం సాయంత్రం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి కాకాణి మంగళవారం ఉదయం తిరుపతి జిల్లా గూడూరులోని సీఆర్‌రెడ్డి స్వగృహానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం సుధీర్‌రెడ్డితో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉపకార వేతనాలు విద్యార్థులకు వరం



దివ్యాంగ విద్యార్థులను ప్రశంసిస్తున్న ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు : దివ్యాంగ విద్యార్థులకు ప్రతి ఏడాది అందిస్తున్న జాతీయ ఉపకార వేతనాలు ఒక వరమని తోటపల్లిగూడూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎండీ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. తోటపల్లిగూడూరు ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులకు చెందిన ఐదుగురు విద్యార్థులు అకడమిక్ మెరిట్ ఆధారంగా జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఉపాధ్యాయులు సదరు విద్యార్థులను ప్రశంసించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ఇక్కడి పాఠశాలలో అందరి విద్యార్థులతో పాటు వికలాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.11 వేల చొప్పున ఇంటర్మీడియట్ వరకు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామచంద్రయ్య, భవిత పాఠశాల రిసోర్స్ పర్సన్లు షహనాజ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే తీవ్ర పరిణామాలు



మాట్లాడుతున్న అడపాల ఏడుకొండలు

వెంకటాచలం : వైఎస్సార్‌సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులపై టీడీపీ నేతలు చేసే తప్పుడు ప్రచారాలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు, ఇస్కపాళెం సర్పంచ్ అడపాల ఏడుకొండలు హెచ్చరించారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక టీడీపీ నేతలు దిగజారుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నేత రాధాకృష్ణమనాయుడుకు నిడిగుంటపాళెంలో ఒక్క ఓటు కూడా పడే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులను రాజకీయంగా ప్రోత్సహిస్తుంటే ఓర్చులేక సోమిరెడ్డి తన గల్లీ నేతలతో తప్పుడు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీ పచ్చబట్ల మస్తానయ్య, నేతలు చీకుర్తి నరసయ్య, తాటిపర్తి సురేష్, షాబాషా, డి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్మశానానికి హద్దులు చూపండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నేతలు

మనుబోలు : మండలంలోని కాగితాలపూరు గ్రామంలో విశ్వబ్రాహ్మణుల శ్మశానానికి హద్దులు చూపాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని శ్మశానాన్ని కొందరు స్థానికులు ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఫలితంగా శ్మశానం కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానానికి హద్దులు ఏర్పరచాలని విన్నవించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు రాము ఆచారి, గౌరవాధ్యక్షుడు జగదీష్‌బాబు, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటకూ సమృద్ధిగా సాగునీరు



కొడవలూరు : మాట్లాడుతున్న డీఈ మధుసూదన్

మనుబోలు : మండలంలోని రైతులకు రెండో పంటకు కూడా సమృద్ధిగా సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ ఈఈ నాగరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ధాన్యం ధరలు ఎక్కువగా ఉండడంతో రెండో పంటను సాగు చేయాలనే ఆలోచనలో ఉన్నామని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. కండలేరు ఆయకట్టు కింద ఉన్న చెరువులకు సాగునీరు విడుదల చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఈఈ నాగరాజు కండలేరు ఆయకట్టు పరిధిలోని బద్దెవోలు, వెంకన్నపాళెం, కట్టువపల్లి, కొలనకుదురు, ఎల్ఎన్‌పురం, పిడూరు, కాగితాలపూరు, మనుబోలు చెరువులకు సాగునీరు అందజేస్తామని తెలిపారు. పిడూరుపాళెం చెరువులో జైకా పనులు జరుగుతున్నందున సాగునీరు విడుదల చేయడం కుదరదన్నారు. కండలేరు లోలెవన్ స్లూయిజ్ నుంచి గురువారం 150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో ఇరిగేషన డీఈ అనిల్‌కుమార్, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి నీటి విడుదల

కొడవలూరు : కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని ఆయకట్టుకు వచ్చే నెల 7వ తేదీ నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ డీఈ ఎన్.మధుసూదన్ తెలిపారు. కొడవలూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కనిగిరి రిజర్వాయర్ పరిధిలో కోవూరు, కొడవలూరు, విడవలూరు, దగదర్తి, అల్లూరు, బుచ్చి మండలాల్లోని ఆయకట్టుకు సాగునీటి కాలువలున్నాయని తెలిపారు. రైతులు వ్యవసాయానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వంతెన నిర్మాణంలో తుది పనులు మాత్రమే మిగిలి ఉన్నందున 7వ తేదీ నాటికి తప్పక పూర్తి చేసి సాగు నీరందిస్తామన్నారు. కొడవలూరు ఇరిగేషన్ ఏఈ పి.పార్థసారథి ఉన్నారు.

రీసర్వేను పూర్తి చేయాలి

కోవూరు : జిల్లాలో జరుగుతున్న భూముల రీసర్వేను సకాలంలో పూర్తి చేయాలని జేసీ కూర్మనాథ్ తెలిపారు. మండలంలోని ఇనమడుగులో జరుగుతున్న భూముల రీసర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ పద్మజ, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.